

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
సోమవారం 12 ఫిబ్రవరి 2024


రాజన్న క్షేత్రం.. భక్త జన సంద్రం 7
8 రోడ్డు వేశారు.. ఇతర పనులు మరిచారు



సిరిసిల్ల టీహబ్‌లోని మిషన్లు

టెస్టుల్లో బెస్ట్

- సిరిసిల్ల టీ-హబ్‌లో నిరంతర సేవలు
- రోగులకు నిత్యం 50 రకాల పరీక్షలు
- జిల్లాలో మూడు రూట్లలో రక్త నమూనాల సేకరణ
- నిరుపేదలకు ఉపయోగకరంగా తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్
- సిరిసిల్ల టీ-హబ్‌కు రాష్ట్ర స్థాయి పురస్కారం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం ప్రారంభించిన తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ (టీ-హబ్) ఆదర్శంగా నిలుస్తోంది. రోగ నిర్ధారణ పరీక్షల కోసం వచ్చే వారికి నిరంతరం సేవలందిస్తోంది. సిరిసిల్ల టీ-హబ్ రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమంగా నిలిచింది. టీ-హబ్ ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా నిరంతరం రోగులకు ఉచితంగా పరీక్షలు చేయడంతోపాటు ఫోన్ ద్వారా టెస్టుల రిపోర్టును అందిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో 2021 ఫిబ్రవరిలో డ్రైరన్‌తో ప్రారంభమైన టీ-హబ్ విజయవంతంగా ముందుకు సాగుతోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందించడంతోపాటు కొవిడ్ సమయంలో టీ-హబ్ ఎంతో ఉపయోగపడింది.

సిరిసిల్ల టీ-హబ్ పరీక్షల వివరాలు

పేషెంట్లు	1,26,083
సేకరించిన శాంపిల్స్	4,23,971
లివర్ పనితీరు పరీక్షలు	45,606
షుగర్ నిర్ధారణ	53,454
కిడ్నీ పరీక్షలు	51,210
థైరాయిడ్ పరీక్షలు	43215
సీబీపీ పరీక్షలు	96829
మైక్రోబయాలజీ పరీక్షలు	51006
కాల్షియం	16004
విటమిన్ బీ - 12	1422
విటమిన్ సీ 3	1506

● జిల్లాలో 4,23,971 మందికి రక్త పరీక్షలు

జిల్లాలో టీ-హబ్ ద్వారా 50 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. మెడికల్ కళాశాల, జిల్లా ఆసుపత్రితో పాటు వేములవాడ ఏరియా ఆసుపత్రి, 13 ప్రాథమిక ఆసుపత్రులు, రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, నాలుగు 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు బస్తీ దవాఖానాల నుంచి మూడు రూట్లలో ప్రతీ రోజు రక్తనమూనాలను టీ-హబ్‌కు చేరుస్తున్నారు. వచ్చిన రక్త నమూనాలను టీ-హబ్‌లో ప్రత్యేకంగా రక్త పరీక్షలు నిర్వహించి రిపోర్టులను పంపిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు టీ-హబ్ ద్వారా లక్షా 26 వేల 83 మంది రోగులు ఆసుపత్రులకు రాగా వారికి సంబంధించి 4 లక్షల 23వేల 971 రక్త పరీక్షలు నిర్వహించారు. టీ-హబ్ ద్వారా ఎంతో విలువైన కిడ్నీ, లివర్, డెంగ్యూ, థైరాయిడ్, డీ డైమర్, వంటి పరీక్షలు చేస్తున్నారు. టీ-హబ్‌కు అనుబంధంగా రేడియాలజీ హబ్‌లో క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేస్తున్నారు. 2023 లోనే 79,365 మంది రోగుల నుంచి 2 లక్షల 54 వేల 410 రకాల పరీక్షలు చేసి ఉత్తమ సేవల విభాగంలో రాష్ట్రంలో ప్రథమంగా నిలిచి అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం ఉన్న 50 రకాల పరీక్షలను మరింత పెంచే ప్రతిపాదనలు పెండిగ్‌లో ఉన్నాయి.


టీహబ్ సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పరీక్షలు

ఆరోగ్య కేంద్రం	పేషెంట్లు	పరీక్షలు
సిరిసిల్ల ఏబీనగర్	5062	20,603
బోయినపల్లి	1637	4907
చీర్లవంచ	1501	9081
చందుర్తి	5727	24,368
ఇల్లంతకుంట	3564	17,696
గంభీరావుపేట	5402	25,914
కొదురుపాక	1690	5276
కోనరావుపేట	3386	8677
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	25	41
లింగన్నపేట	731	2847
నేరెళ్ల	2173	10,891
పోత్గల్	3996	16,714
సిరిసిల్ల పీఎస్‌నగర్	4721	17,771
రాజీవ్‌నగర్ (బీడీ)	1777	2813
జిల్లా ఆసుపత్రి	50,472	1,24,939
తంగళ్లపల్లి	3227	11,228
వేములవాడ	18,152	67,281
విలాసాగర్	1727	7940
ఎల్లారెడ్డిపేట	11,613	44,984
మొత్తం	1,26,083	4,23,971

టీ-హబ్‌కు అవార్డు రావడం హర్షణీయం

- కలెక్టర్ అనురాగ్ జయంతి

జిల్లా కేంద్రంలోని టీ-హబ్ ఉత్తమ సేవల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలవడం, అవార్డు రావడం హర్షణీయం. టీ-హబ్ సిబ్బంది ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలి. సిబ్బంది అందిస్తున్న సేవలకు అభినందనలు.

నేడు శివభక్త మార్కండేయస్వామి శోభాయాత్ర

సిరిసిల్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శివభక్త మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్రను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మార్కండేయ స్వామి దేవస్థానం నుంచి పుర వీధుల్లో స్వామివారి ఊరేగింపు ఎంతో సందడిగా జరగనుంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ బండి సంజయ్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావుతోపాటు ప్రజాప్రతినిధులు, పద్మశాలి సంఘం ప్రతినిధులు హాజరుకానున్నట్లు పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ తెలిపారు.

'గృహజ్యోతి' కోసం విద్యుత్ మీటర్ల నంబర్ల సేకరణ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల విద్యుత్ బిల్లుల మాఫీ కోసం ఆదివారం సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ పరిధిలో అధికారులు మీటర్ల వివరాలు సేకరించారు. సిరిసిల్ల పట్టణంలోని 39 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి కరెంట్ మీటర్ల సర్వీస్ నంబర్లతోపాటు ఇంటి యజమాని ఆధార్, రేషన్ కార్డుల నంబర్లు, ప్రజాపాలన దరఖాస్తు నంబరు తదితర వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సెస్ ఏఏఈలు ప్రభాకర్‌రావు రాజేందర్, జగదీష్, ఏఈలు మధుకర్, సుష్మా, జ్యోతి, కుమార్ పాల్గొన్నారు.

కొండూరు రవీందర్‌రావుకు సన్మానం


రవీందర్‌రావును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంభీరావుపేట, పిబ్రవరి 11 : గంభీరావుపేట మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావును బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సన్మానించారు. ఎన్‌సీడీసీ, బీఐఆర్‌డీ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా కొండూరు రవీందర్‌రావు వరుసగా రెండోసారి నామినేట్ కావడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గంభీరావుపేటలోని సింగిల్‌విండో కార్యాలయానికి రవీందర్‌రావు ఆదివారం రావడంతో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, కొత్తపల్లి సింగిల్‌విండో చైర్మన్ సురేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దయాకర్‌రావు, మాజీ సర్పంచ్ రాజు, నాయకులు లింగమ్‌యాదవ్, రాజేందర్, రాజు, వహీద్, గౌసొద్దీన్, శేఖర్‌గౌడ్, ఎగదండి స్వామి, అభిలాష్, రమేష్, నాగరాజుగౌడ్, నర్సయ్య, శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో 2001-02 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి విద్యార్థులు ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ముత్తయ్య, వేణు రెడ్డి, దేవరాజు, బాలరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

జిల్లా కాంగ్రెస్ ఫిషర్ మన్ ప్రధాన కార్యదర్శికి సన్మానం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 11: జిల్లా కాంగ్రెస్ ఫిషర్ మన్ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన చెన్నవేని ప్రశాంత్‌ను తంగళ్లపల్లి మండలం మండేపల్లి ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తోందని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు తండ్రి వాసుదేవరావు స్మారకార్థం నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యం, మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోలీసులు, విలేకరులు, ప్రజాప్రతిధులు, మండల అధికారులు, షటిల్ బ్యాడ్మింటన్, బీజేపీ జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. పోలీసు, విలేకరులు, మండల అధికారులు, షటిల్ బ్యాడ్మింటన్ జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు, నాగరాణి, అనసూయ, మధు, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సత్యం, మాజీ జడ్పీటీసీ నర్సయ్య, మాజీ సర్పంచులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇప్పల్లపల్లెలో ప్రమాదకరంగా గేట్‌వాల్వ్

- ఇబ్బందులుపడుతున్న విద్యార్థులు, గ్రామస్థులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని ఇప్పల్లపల్లెలో ప్రధాన రోడ్డుతోపాటు ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ఉన్న మంచినీటి గేట్‌వాల్వ్ ప్రమాదకరంగా మారింది. దీంతో నిత్యం విద్యార్థులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పల్లపల్లెలో మంచినీటి కోసం వేసిన పైప్‌లైన్‌లకు ట్యాంక్‌నుంచి వచ్చే నీటిని విడుదల చేసేందుకు గతంలో గ్రామపంచాయతీ ఉన్న సమయంలో రోడ్డు పక్కనుంచి వేసిన పైప్‌లైన్‌కు మధ్యలో గేట్‌వాల్వ్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు వెడల్పు కావడంతోపాటు సిరిసిల్ల - కామారెడ్డి ప్రధాన రోడ్డు నుంచి రెండో బైపాస్ రోడ్డుకు ప్రధానంగా ఉంది. రెండో బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్‌కు ఈ రోడ్డు నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు మధ్యలోకి వచ్చిన గేట్‌వాల్వ్ ప్రమాదకరంగా మారింది. గేట్‌వాల్వ్‌పై కప్పు లేకపోవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వచ్చే విద్యార్థులతోపాటు రోడ్డునపోయే వాహనదారులు అందులో పడుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న గేట్‌వాల్వ్‌ను మూసివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న గేట్‌వాల్వ్

నిత్యం ప్రమాదాలు



- ఆదిపెల్లి శ్రీనివాస్‌గౌడ్, పెద్దూర్

ఇప్పల్లపల్లె ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ఉన్న గేట్ వాల్ ప్రమాద కరంగా మారింది. తరచూ విద్యార్థులు అందులోపడి గాయపడుతు న్నారు. దీనిని మూసివేయాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మున్సిపల్ చైర్‌పర్సన్ పరిశీలించాలి.

అధికారులు స్పందించాలి



- కిషన్‌యాదవ్, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్

ఇప్పల్లపల్లె ప్రధాన రోడ్డుపై ఉన్న మంచినీటి గేట్ వాల్‌తో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సిరిసిల్ల నుంచి అపెరల్ పార్క్‌కు వెళ్లే కార్మికుల రాత్రిపూట గేట్ వాల్ కనిపించకపోవడంతో అందులో పడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి దానిని మూసి వేయాలి.

బీజేపీకి 400 ఎంపీ స్థానాలు ఖాయం


చందుర్తిలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

- మూడోసారి ప్రధాని కానున్న మోదీ
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

చందుర్తి, ఫిబ్రవరి 11: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో 400 లోక్‌సభ స్థానాలు గెలుచుకుంటామని, మూడోసారి కూడా నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల తరఫున కొట్లాడింది బీజేపీయేనని, అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ అని అన్నారు. తాను కొట్లాడితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనే సంగతి అందరికీ తెలుసని, కాంగ్రెస్ ఏనాడూ ప్రజల కోసం పోరాటాలు చేయలేదని అన్నారు. ప్రజల కోసం కేసులు ఎదుర్కొన్నామని, జైలుకు వెళ్లామని అన్నారు. ప్రజల కోసం కుటుంబాలను వదులుకొని నిరంతరం కొట్లాడిన పార్టీ బీజేపీయేనన్నారు. అయోధ్యలో రాముడికి గుడి కడితే ఏమొచ్చిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారన్నారు. దేశ ప్రజలంతా బాగుండాలని దేవుడిని కోరతాం తప్ప ఏదో రావాలని కడతామా? అని ప్రశ్నించారు. అయోధ్య అక్షింతలను కూడా రేషన్ బియ్యమంటూ కాంగ్రెస్ హేళన చేసిందన్నారు. దేవుడిని హేళన చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఛీత్కరించాక బుద్ధి వచ్చిందన్నారు. అయోధ్యలో రామ మందిరం కట్టడం మంచిదేనని ఆ పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బాబ్రీ మసీదు కట్టాలని కుట్ర చేస్తోందన్నారు. రాహుల్ విన్సీ గాంధీ పేరు పెట్టుకొని రాహుల్ గాంధీగా మారితే జనం ఓటేస్తారా? అన్నారు. బీఆర్ఎస్ పనైపోయిందని, కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమని అన్నారు. జనం ఛీ కొట్టిన బీఆర్ఎస్‌తో బీజేపీ ఎందుకు పొత్తు పెట్టుకుంటుందన్నారు. పొత్తు పేరుతో ప్రజలను గందరగోళపర్చేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ కుట్ర చేస్తున్నాయన్నారు. వేములవాడ నియోజకవర్గానికి 7 పథకాల కింద కేంద్రం దాదాపు రూ.600 కోట్లకుపైగా ఇచ్చిందన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి కోసం రూ.400 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. కేంద్రానికి ప్రతిపాదనలు పంపితే ప్రసాదం స్కీం కింద వేములవాడను అభివృద్ధి చేస్తామని చెప్పినా పట్టించుకోని దుర్మార్గుడు కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతు బంధు కింద రూ.15 వేలు, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయన్నారు. బీఆర్ఎస్ గుడిని మింగితే కాంగ్రెస్ గుడి లింగాన్ని మింగే బాపతన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొన్న బడ్జెట్‌లో పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు రూ. 5లక్షల కోట్లకు పైగా కేటాయించాల్సి ఉంటే. అందులో 10వ వంతు నిధులు కూడా కేటాయించలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనన్నారు. మోదీ ప్రభుత్వం మళ్లీ ఏర్పడితేనే, తెలంగాణ రాష్ట్రానికి అధిక నిధులు వస్తాయన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లేనన్నారు. వడ్డించే వాడికి అధికారం ఇస్తేనే మన బతుకులు బాగుపడతాయన్నారు. మోదీకి ఓటేస్తే దళారుల బెడద లేకుండా నూటికి నూరు పైసలు మీ ఖాతాల్లోకి వచ్చి చేరతాయన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే అండగా ఉంటానన్నారు. అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠ కల నెరవేరిందంటే అది మోదీ చలవేనన్నారు. కారు షెడ్డుకే. కేసీఆర్ ఇక ఫాంహౌస్‌కే పరిమితమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాసరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నియోజకవర్గం కన్వీనర్ మార్త సత్తయ్య, నాయకులు పొంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, ఎర్రం మహేష్, కటకం లోకేష్, గంగాధర్, గంగరాజు, తిరుపతి, మల్లేశం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహిత యాత్రకు విశేష స్పందన

రుద్రంగి: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రజాహిత యాత్ర ఆదివారం రుద్రంగి మండల కేంద్రానికి చేరుకుంది. ప్రజాహిత యాత్రలో భాగంగా డప్పు చప్పుళ్లు, ఒగ్గు కళకారుల విన్యాసలతో మహిళలు, బీజేపీ నాయకులు బండి సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఇందిరాచౌక్ చౌరస్తా నుంచి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలని కోరారు. ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ వేములవాడ నియోజకవర్గ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వెంకటేష్, బీజేపీ సీనియర్ నాయకులు అల్లాడి రమేష్, పడాల గణేష్ పాల్గొన్నారు.


డిజిటల్ యూపీఐతో ఉపయోగం ఉందా..

డిజిటల్ యూపీఐతో ఉపయోగం ఉందా? అంటూ బండి సంజయ్ కూరగాయాలు విక్రయించే మహిళను ప్రశ్నించారు. దీనికి ఆమె ఉపయోగం ఉందని, బ్యాంకు ఖాతాలో డబ్బులు పడుతున్నాయని సమాధానం చెప్పింది. బ్యాంకు ఖాతా ఎవరు తీయించారని ప్రశ్నించగా జన్ ధన్ యోజన కింద మోదీ ప్రభుత్వమే ఓపెన్ చేయించిందంటూ బదులిచ్చింది.


రుద్రంగిలో డోలు వాయిస్తున్న ఎంపీ బండి సంజయ్







గంగపుత్రుల హక్కులు కాపాడుతాం

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గంగ పుత్రుల హక్కులు కాపాడడానికి అనవరమైన కృషి చేస్తానని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన గంగపుత్రుల మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కుల సంఘ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానన్నారు. చెరువులు, కుంటలపై కేవలం గంగపుత్రులకు మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో గీచే వాడిదే చెట్టు అని హక్కు కల్పించామని, చేపలు పట్టే వారికే చెరువులు, కుంటలపై గంగపుత్రులు, మత్స్య కార్మికులకు హక్కులు ఉండాలన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ సెల్ అధ్యక్షుడు మిట్ల సాయికుమార్, పలువురు గంగపుత్ర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.







యువకుడి ఆత్మహత్య

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంబజార్ కాలనీకి చెందిన మంతెన అక్షయ్ (27) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్షయ్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి పరిశీలన జరిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. సంఘటనపై ఎస్ఐ మన్మథరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నటేశ్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మానకొండూర్, ఫిబ్రవరి 11: మండలంలోని శంషాబాద్ గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై గుర్తు తెలయని వాహనం ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని గ్రామపంచాయితీ సిబ్బంది ఎండీ హకీం ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

ఎండపల్లి, ఫిబ్రవరి 11: రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీ కొట్టడంతో మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన బోగ లచ్చయ్య(50) ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ప్రయాణికుల కోసం ఆటోను గ్రామంలోని ఒక స్టేజీ వద్ద పెట్టి ఇంటికి బయలుదేరాడు. వెల్గటూర్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు (ఏపీ 40 ఏఎన్7609) నడుచుకుంటూ వెళ్తున్న లచ్చయ్యను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తరుపున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ శ్వేత తెలిపారు.

డెంగ్యూతో బాలిక..

పెగడపల్లి, ఫిబ్రవరి 11: పెగడపల్లి మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన వేముల చతుర్వేద (7) అనే బాలిక ఆదివారం డెంగ్యూ జ్వరంతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరవెల్లి గ్రామానికి చెందిన వేముల పవన్ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ ఏడాది కాలంగా భార్యా పిల్లలతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వారం రోజులుగా చతుర్వేద డెంగ్యూ జ్వరం బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.



చతుర్వేద (ఫైల్)

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

మానకొండూర్, ఫిబ్రవరి 11: అంతర్ జిల్లా దొంగల ముఠాను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పోలీసుల అదుపులో అంతర్ జిల్లా దొంగల ముఠా అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని సదాశివపల్లి వద్ద శనివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టాను. ఆ సమయంలో ఓ కారు (టీఎస్ 21డి 7715)లో ఇద్దరు దాని వెనకాల స్కూటీపై ఒక్కరు వస్తుండగా వాహనాలను పోలీసులు నిలిపివేశారు. వాహనాలను తనిఖీ చేయగా అందులో ఇన్వర్టర్, ఉడెన్ టేబుల్, రాగి వైరు కట్టతో పాటు స్కూటీపై టేబుల్ ఫ్యాను ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో మానకొండూర్‌కు చెందిన కోండ్ర ఫణీందర్, కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన నెరువట్ల వెంకటేశ్, నెరువట్ల అజయ్, పర్వతం సతీష్ ఒక ముఠాగా ఏర్పడి కరీంనగర్ జిల్లాలోని మానకొండూర్, సైదాపూర్, జమ్మికుంట, హుజురాబాద్, కరీంనగర్‌రూరల్, ఎల్ఎండీతో పాటు పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలోని జూలపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాలలో విద్యుత్ మోటార్లు, వాటి పరికరాలను దొంగిలించిగా 27 కేసులు నమోదు అయినట్లు తేలింది. దొంగిలించిన వస్తువులను మానకొండూర్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సిరిగిరి వెంకటమ్మ, కరీంనగర్‌లోని అల్కాపురి కాలనీకి చెందిన టేకు మల్లేశం, కోతిరాంపూర్‌కు చెందిన లోకిని లక్ష్మికి విక్రయించారు. కొనుగోలు చేసిన వ్యక్తులతో పాటు ముఠా సభ్యుడు అజయ్‌పై కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద ఉన్న కారు, స్కూటీ, రాగివైర్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకునేందుకు కృషి చేసిన మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అభినందించారు.



భక్తురాలి బంగారం చోరీ

వేములవాడ, ఫిబ్రవరి 11: రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం వేములవాడకు వచ్చిన వరంగల్ జిల్లాకు చెందిన రామక్క అనే 70 సంవత్సరాల వృద్ధురాలిని నమ్మించి బంగారం కాజేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రాజన్నను దర్శించుకున్న అనంతరం జాతర గ్రౌండ్ వైపు నడచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని గమనించిన నిందితుడు మీ గది పక్కనే తాము కూడా ఉన్నామని నమ్మించి ద్విచక్ర వాహనంపై ఎక్కించు కున్నాడు. జగిత్యాల బస్‌స్టాండ్ వైపు తీసుకెళ్లి దాదాపు మూడున్నర తులాల బంగారు గొలుసును లాకున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. నిందితుడు మెరున్‌కలర్ చెక్స్ ఉన్న షర్టు, ప్యాంటు దరించి ఉన్నాడని, ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. రాజన్న సన్నిధికి వచ్చిన భక్తులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

చందుర్తి, ఫిబ్రవరి 11: కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీపై కుట్రలు చేస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా ఆదివారం రెండో రోజు చందుర్తి మండలం లింగంపేటలో ప్రారంభమైంది. కట్టలింగంపేట, మల్యాల, చందుర్తి, రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో యాత్ర కొనసాగింది. ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా కట్టలింగంపేటలో రేషన్ దుకాణంలో బండి సంజయ్ పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు రాగానే రెండు పార్టీలు ఒక్కటవుతాయని, పైకి మాత్రం తిట్టుకుంటారని అన్నారు. కరీంనగర్‌లో



మాట్లాడుతున్న బండి సంజయ్

కాంగ్రెస్ ఇప్పటి వరకు అభ్యర్థిని పెట్టలేదని, కేవలం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉండడానికి చూస్తోందని అన్నారు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని కాంగ్రెస్ ప్రచారం చేసిందన్నారు. బీజేపీని బదనాం చేయడానికే కుట్ర చేశారన్నారు. బీజేపీ అత్యధిక స్థానాలు గెలవనున్నట్లు సర్వేలు వచ్చాక వాళ్లకి మనసున పడడం లేదన్నారు. తమది బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే మూర్ఖత్వం పార్టీ కాదన్నారు. ఒంటరిగా పోటీ చేస్తున్నామని చెప్పుకునే దమ్ము బీఆర్ఎస్‌కు లేదన్నారు. తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమనే ప్రజలు గమనించాలన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేశాయన్నారు. ఫామ్ హౌస్‌లో ఉంటున్న కేసీఆర్ మళ్లీ కుట్రలు చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి ఒక్క ఎంపీ సీటు రాదని, తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టారని అన్నారు. బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ చూశాక ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. ఈ నెల చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, ఎన్నికల షెడ్యూల్ అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై కాలయాపన చేస్తుందని అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ లేని దేశాన్ని ఊహించుకోలేమన్నారు. మేడిగడ్డ కుంగడంపై లక్ష కోట్లు ఖర్చు చేసి ప్రజల ధనం వృథా అయితే బీఆర్ఎస్ చిన్న సమస్య అంటోందన్నారు. కాంగ్రెస్ ఎందుకు విచారణకు ఆదేశించడం లేదన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా ఊహించుకోవడం కష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నాయకులు పోంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, కటకం లోకేష్, పెరిక గంగరాజు, ఎర్రం మహేష్, రేగుల మల్లికార్జున్, చింతకుంట గంగాధర్, లోకోజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభంజనంలో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు


దుంపెటలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎంపీ బండి సంజయ్

కథలాపూర్: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రభంజనం మూడో సారి వీస్తుందని అందులో ప్రతిపక్షాలు కొట్టుకుపోవడం తథ్యమని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా రెండోరోజు మండలంలోని సిరికొండ నుంచి ఆరంభం కాగా విలేకరులతో కాసేపు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పరిస్థితి ఎప్పటికీ తలెత్తదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందని మునిగిపోయిన నావతో సంబంధాలు ఎలా పెట్టుకుంటామని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ అధ్వానంగా ఉందని ఆరు గ్యారంటీలకు కావల్సిన వ్యయం, కేటాయించిన నిధులకు భారీ తేడా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పరిపాలన చేతకాదని ఈ బడ్జెట్ రూపకల్పనతో తేలిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని ప్రజలు విసుగెత్తిపో యారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాయకులు, యువత పకడ్బందీగా పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థిక అభివృద్ధిలో పురోగమనంకు బాటలు వేసినట్లు చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో నిర్వహించిన సర్వేలైనా బీజేపీ విజయం సాధిస్తుందని చెబుతున్నాయన్నారు. అనంతరం సిరికొండ, దూలూరు, దుంపెట, తాండ్ర్యాల, అంబారిపేట, కలికోట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాహిత యాత్రలో చిన్నారులను ఎత్తుకున్నారు. మహిళలు, వృద్ధులకు అభివాదం తెలిపారు. పలు గ్రామాల్లో శివాజీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెల్ఫీలు దిగేందుకు యువకులు పోటీపడ్డారు. గ్రామాల్లో ఎంపీకి డీజే చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. వాడల్లో తిరుగుతూ నమస్కరించారు. గడిచిన ఐదేళ్లలో పార్లమెంట్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, ధన్‌పాల్ సూర్యనారాయణ, ప్రవీణ్, జలంధర్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు

- అత్తింటివారిపై భర్త దాడి.. ఆత్మహత్యాయత్నం


గొంతుకోసుకున్న కళాధర్

బోయినపల్లి, ఫిబ్రవరి 11: భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. భర్త తీరు మారకపోవడంతో భార్య విడాకులు కోరింది. నిరాకరించిన భర్త ఆమె ఇంటికి చేరుకొని చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేసి బ్లేడుతో గొంతు కోసుసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. బోయినిపల్లి మండలం రామన్న పేటగ్రామంలో ఆదివారం చోటు చేసుకున్న సంఘటన వివ రాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట గ్రామానికి చెందిన శ్వేతకు ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటకు చెందిన సామ కళాధర్‌రెడ్డికి 2021లో వివాహమైంది. ఆరు నెలల అనంతరం కళాధర్ మద్యానికి బానిసయ్యాడు. భార్యశ్వేతను వేధించ సాగాడు. భర్త తీరు మారకపోవడంతో శ్వేత పెద్ద మనుషుల సమక్షంలో నిర్వహించిన పంచాయితీలో విడాకులు కోరింది. ఆదివారం తెల్లవారుజామున కళాధర్ శ్వేత ఇంటికి వచ్చి చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. తలుపులు తీయకపోవడంతో కళాధర్ వెంట తెచ్చుకున్న బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకోని 108 ద్వారా సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. కళాధర్ హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. శ్వేత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూగజీవాలపైకి దూసుకెళ్లిన లారీ

- 40 గొర్రెలు మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: మండలంలోని చిగురుమామిడి గ్రామపంచాయితీ పరిధిలోని రాజన్నపల్లి వద్ద ఆదివారం గ్రానైట్ లారీ ఢీకొన్న ప్రమాదంలో 40 గొర్రెలు మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. చిగురుమామిడికి చెందిన సౌదం కనుకయ్య, ముదుకిరి సమ్మయ్య గ్రామ శివారులో గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం వేళ ఇంటికి తరలిస్తుండగా కరీంనగర్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ(టీఎస్ 02 యూఏ 6438) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేచపల్లిలో కలకలం..

- పోలీసుల అదుపులో పౌర హక్కుల సంఘం నేత రాజేశం
- నాటకీయ పరిణామాల మధ్య ఛత్తీస్‌గఢ్‌కు తరలింపు
- కిడ్నాపర్లుగా భావించి పోలీసులకు గ్రామస్థుల సమాచారం

అది జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచపల్లికి వెళ్లే రోడ్డు.. ఆదివారం తెల్లవారు జామున ఆ రోడ్డుపై రెండు నంబర్‌ప్లేట్ లేని వాహనాలు కనిపించాయి. ఆ వాహనాల్లో నుంచి దిగిన ఎనిమిది మంది వ్యక్తులు హిందీలో ఏదో మాట్లాడుకుంటున్నారు.. అటువైపు వెళ్లిన బట్టపల్లి గ్రామానికి రైతులు వారిని గమనించి చిన్న పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చిన ముఠాగా భావించారు. ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. వారు వాహనాల్లో వచ్చిన వారిని నిలదీయడంతో తాము ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులమని తెలిపారు. దీంతో గ్రామస్థులు సారంగపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వచ్చి వారితో మాట్లాడి ఛతీస్‌గఢ్ పోలీసులు అని నిర్ధారించుకుని వెళ్లిపోయారు. అనంతరం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులు రేచపల్లికి వెళ్లి పౌరహక్కుల సంఘం నేత పోగుల రాజేశంను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది.

- ఆంధ్రజ్యోతి, జగిత్యాల/ సారంగాపూర్

ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా గీదం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కోశాధికారి రాజేశంను ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. దంతేవాడ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో గల ఓ కేసులో విచారణ కోసం తీసుకవెళ్తామని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఇదేమిటని కుటుంబసభ్యులు ప్రశ్నించినప్పటికీ బలవంతంగా రాజేశంను, అతని భార్య మల్లీశ్వరిని వాహనంలో తీసుకెళ్లారు. రేచపల్లి శివారులోకి వెళ్లిన అనంతరం రాజేశం భార్య మల్లీశ్వరిని వాహనం నుం చి దింపివేసి వెళ్లిపోయారు. రాజేశంను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుళ్లారని ఆయన మల్లీశ్వరి, కుటుంబ సభ్యు లు అంటున్నారు. ఈ విష యమై సారంగపూర్ ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ రేచపల్లి గ్రామానికి వచ్చి రాజేశంను తీసుకవెళ్లింది ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా గీదం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిగా ధ్రువీకరిం చుకున్నామని తెలిపారు. తీవ్రవాదానికి సంబంధించిన ఓ కేసులో నిందితుడిగా ఉన్న రాజేశంను ఛత్తీస్‌గడ్ పోలీసులు అరెస్టు చేశారన్నారు.




ఛత్తీస్‌గఢ్ పోలీసులు రేచపల్లికి వచ్చిన నంబరు లేని వాహనం, రాజేశంను ఇంటికి పంపాలని వేడుకుంటున్న భార్య, కుమారుడు


పోగుల రాజేశం

● రాజేశంను వెంటనే విడిచిపెట్టాలి

- రాజేశం భార్య మల్లీశ్వరి, కుమారుడు శ్రీనివాస్

పౌరహక్కుల సంఘం నేత రాజేశంను వెంటనే విడిచిపెట్టాలని ఆయన భార్య మల్లీశ్వరి, కుమారుడు శ్రీనివాస్‌లు కోరుతున్నారు. ఆదివారం జగిత్యాల డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. రేచపల్లి గ్రామానికి గుర్తు తెలియని వాహనాల్లో వచ్చిన కొందరు వ్యక్తులు బలవంతంగా రాజేశంను తీసుకవెళ్లారన్నారు. విషయాన్ని పోలీసులకు అందించగా ఛత్తీస్‌గఢ్‌కు ఓ కేసు విచారణలో రాజేశంను అక్కడి పోలీసులు తీసుకవెళ్లారని అంటున్నారని, తమకు సమాచారం లేదన్నారు. రాజేశంను వెంటనే విడిచి పెట్టాలని కోరారు.

● రాజేశం కిడ్నాప్‌ను ఖండిస్తున్నాం

- కుమార స్వామి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

పోగుల రాజేశంను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి అన్నారు. ఆయన జగిత్యాలలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం లేకుండా పలువురు వ్యక్తులు ఛత్తీస్‌గడ్ పోలీసులుగా చెప్పుకుంటూ రాజేశంను తీసుకవెళ్లడం సమంజసం కాదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఫోన్ ద్వారా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను సంప్రదించగా పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రాజేశంను అక్రమ నిర్బంధం నుంచి వెంటనే విడిపించాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రశ్నించే గొంతుకలుగా ఉన్న పౌర హక్కుల సంఘం కార్యకర్తలు, రచయితలు, జర్నలిస్టులు, మేధావులను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ఛత్తీస్‌గడ్ ప్రభుత్వాలు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, ఉపాధ్యక్షుడు నార వినోద్, సహాయ కార్యదర్శి గడ్డం సంజీవ్ కుమార్, కార్యవర్గ సభ్యులు కడ రాజన్న, మోటపలుకుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో మహిళ ఆత్మహత్య

ధర్మారం, ఫిబ్రవరి 11: మండల కేంద్రానికి చెందిన గోల్కొండ రాజేశ్వరి(37) తన రేకుల షెడ్డులో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన్ని సంవత్సరాల నుంచి ఆమె మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో ఆమె జీవితంపై విరక్తి చెంది తన రేకుల షెడ్డులో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. మృతురాలి భర్త రాజేశం జీవనోపాధి కోసం దుబాయ్‌లో ఉన్నాడు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. తల్లి నర్ర వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై 2 ఎస్ అశ్విని తెలిపారు.

ఆరెపల్లిలో చోరీ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11: వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన శ్రీనివాస్ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లాడు. భార్య బంధువుల ఇంట్లో నిద్రించింది. శనివారం ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా తాళం పగలగొట్టి ఇంట్లోని రూ. లక్ష నగదుతోపాటు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జనసంద్రంగా మారిన వేములవాడ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 11: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఆదివారం అశేష భక్తజనంతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. భారీ సంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

ఎగువ మానేరుకు జలకళ

గంభీరావుపేట, ఫిబ్రవరి 11: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ నుంచి గోదారి జలాలు వస్తుండడంతో మానేరు జలాశయం నిండుతోంది. మల్లన్నసాగర్ నుంచి నీటిని వదలడంతో కూడవెల్లి వాగు మీదుగా మానేరులోకి గోదారి జలాలు వస్తున్నాయి. మొత్తం 31 అడుగుల నీటి సామర్థ్యం ఉన్న మానేరు జలాశయం ప్రస్తుతం 26 ఫీట్లకు చేరింది. నీటి విడుదలకు ముందు మానేరులో 20 అడుగుల వరకు నీరు ఉండేది. మల్లన్నసాగర్ నుంచి నీరు ఉధృతంగా వస్తుండడంతో కేవలం 4 రోజుల్లో 26 ఫీట్లకు చేరింది. మల్లన్నసాగర్ నుంచి గోదారి జలాలు ఇదే విధంగా వస్తే మరో మూడు రోజుల్లో మానేరు పూర్తిగా నిండే అవకాశం ఉంది.

ఆర్మీ జవాన్‌కు పుడమి రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజు

చందుర్తి, ఫిబ్రవరి 11 : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ డా.పెరుక రాజు సాహిత్యానికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పవర్ ఐకాన్ అవార్డు-2024ను ఆదివారం అందుకున్నారు. సాహిత్యంలో రాజు సేవలను గుర్తించి హైదరాబాద్‌లో దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం అందజేశారు.ఈ సందర్భంగా రాజును గ్రామస్థులు అభినందించారు.

వైద్య శిబిరం ప్రారంభం


మందులు పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11 : ప్రతీ ఒక్కరు సేవ గుణాన్ని అలవరుచుకోవాలని, సాటివారికి తోచినంత సహాయం అందించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం చీర్లవంచలో సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తే ఎప్పటికీ మర్చిపోరని, సాటి మనిషికి సేవ చేయాలనే ఆలోచన ప్రతీ ఒక్కరికి రావాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, బొనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11 : సినీ నటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలని టీఎస్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్లలో ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల నటుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అనేక సంక్షేమ పథకాలతో ప్రజల ఆదరణ పొందారన్నారు. తెలుగువారి ఖ్యాతిని ఆత్మగౌరవాన్ని దేశ నలుమూలలకు చాటి చెప్పిన మహానాయకుడిని విస్మరించకుండా కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలని కోరారు.

ఘనంగా పోచమ్మ చలి బోనాలు

రుద్రంగి, ఫిబ్రవరి 11: రుద్రంగి మండల కేంద్రంతోపాటు మానాల గ్రామంలో గ్రామదేవత పోచమ్మకు గ్రామంలో మహిళలు ఆదివారం చలి బోనాలు ఘనంగా నిర్వహించారు. తలస్నానం ఆచరించి బోనం వండి ఉదయాన్నే పోచమ్మకు సమర్పించడం ఆనవాయితీ. మహిళలు భారీ సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11 : సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కార్మికుడు మామిడాల రమేష్ ఇల్లు ప్రమాదావశాత్తు ఇటీవల కాలిపోవడంతో ఆదివారం రమేష్ కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పరామర్శించారు. అగ్నిప్రమాదంలో ఇంట్లోని నిత్యావసర సరుకులు, దుస్తులు, ఇంటి సామగ్రి కాలిపోవడంతో నష్టం వాటిల్లింది. రమేష్ కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.8 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రమేష్ కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెల్దండి దేవదాస్, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, గాజుల బాలయ్య, వెంగల శ్రీనివాస్, మెరుగు లక్ష్మన్, సామల శ్రీనివాస్, దూస రాజేశం, కట్ల శ్రీనివాస్, గోనె రాజేష్, జిందం దేవదాస్ పాల్గొన్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11: హైదరాబాద్‌లో మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల జాతీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు ఆవునూరి ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జాతీయ సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. దాదాపు 30 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ ఎస్సీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. ఈ పోరాటాల ఫలితం త్వరలోనే రానుందన్నారు. ఈ నెల 8న సుప్రీం కోర్టులో ఏడుగురు జడ్జిల సమక్షంలో వాదనలు వినిపించామని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, కో కన్వీనర్ పసుల కమలాకర్, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లారం చంద్రమౌళి, నాయకకులు చంద్రమౌళి, నేదూరి బాబు, కలకోట రవిబాబు,మధు పాల్గొన్నారు.

వడ్డెర కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11 : తెలంగాణ ప్రభుత్వం వడ్డెర కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో వడ్డెర రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభకు జిల్లా నుంచి ఆ సంఘం నాయకులు, కులస్థులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేయి కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లంగుల బాలకృష్ణ, కార్యదర్శి వేముల రాములు, రాష్ట్ర నాయకుడు పీట్ల వెంకటేశం, జిల్లా గౌరవ అధ్యక్షుడు కొమ్మురాజుల ఎల్లయ్య, వేములవాడ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షుడు దండుగుల తిరుపతి, సిరిసిల్ల నియోజకవర్గం అధ్యక్షుడు దారంగుల ఎల్లయ్య, సిరిసిల్ల పట్టణ యూత్ అధ్యక్షుడు తమ్మిశెట్టి చందు, నాయకులు జలపతి వెంకటి, పల్లపు మల్లేశం, శివరాత్రి మల్లయ్య, తమ్మిశెట్టి శ్రీనివాస్, లైపు రాయనర్సు, ఆలకుంట కుమార్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ముస్తాబాద్, ఫిబ్రవరి 11: ముస్తాబాద్ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఎల్లమ్మ అలయం వద్ద ఆవిష్కరించారు. ప్రభుత్వం రాజకీయపరంగా సరైన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండ యాదగిరి గౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, సతీష్ గౌడ్, అయోధ్య రాజారం, బుర్ర రాములు, శ్రీనివాస్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. మిగతా పనులు మరిచారు


వెలగని రుద్రంగి సెంటర్ లైటింగ్

- వెలగని రుద్రంగి సెంట్రల్ లైటింగ్
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- రుద్రంగివాసుల ఇబ్బందులు


ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు

రుద్రంగి, ఫిబ్రవరి 11: రుద్రంగి మండల అభివృద్ధిలో భాగంగా రోడ్డు పనులు పూర్తి చేసిన అధికారులు ఇతర పనులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో మండల కేంద్ర వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రుద్రంగి మండల కేంద్రంలో రూ.కోటి 90 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ మున్నాళ్ల ముచ్చటే అయ్యింది. మూడేళ్ల క్రితం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి సాయి నగర్ వరకు డివైడర్‌తో కూడిన సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. సుమారు 55 విద్యుత్ స్తంభాలకు 110 లైట్లను అమర్చారు. పదినెలల్లోనే అందులో సగం లైట్లు పాడైపోయాయి. విస్తరణలో భాగంగా సుమారు రెండు మీటర్ల వరకు రోడ్డు ఎత్తు పెంచారు. డివైడర్ పూర్తిగా మునిగిపోయింది. నూతనంగా ఫోర్‌లైన్ రోడ్డుతోపాటు డివైడర్ ఏర్పాటు చేశారు. కాని సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకపోవడం, గతంలో పాడైన లైట్లకు మరమ్మతు చేయకపోవడంతో రుద్రంగిలోని కోరుట్ల- వేమలవాడ ప్రధాన రహదారి పొడవున అంధకారం నెలకొంది. ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లైట్లు నాసిరకంగా ఉండడంతోనే వెలగడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. డివైడర్‌కు రంగులు వేయకపోవడంతో చీకట్లో వాహనాలు డివైడర్‌కు తగిలి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్లు

రుద్రంగి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు మూడు నెలల క్రితం పూర్తయ్యాయి. రోడ్డు ఎత్తును సూమారు రెండు మీటర్లు పెంచడంతో కాలనీల నుంచి ప్రధాన రహదారికి వచ్చేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన రహదారికి ఇరువైపులా సూమారు 30 వరకు అప్రోచ్ రోడ్లు ఉన్నాయి. రోడ్డు ఎత్తుగా ఉండడంతో కాలనీల రోడ్లు పూర్తిగా డౌన్ అయ్యాయి. దీంతో కాలనీల నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చే సమయంలో అలాగే ప్రధాన రహదారి నుంచి కాలనీలకు కిందకు దిగే సమయంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయం నుంచి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం ముందు


రోడ్డు ఎత్తు పెరగడంతో కిందికైన దుకణాలు

ఐదు అప్రోచ్ రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పోలీస్ స్టేషన్ నుంచి ఇందిరా చౌక్ వరకు రోడ్డుకు ఇరువైపులా సూమారు 10 అప్రోచ్ రోడ్లు ప్రమాకరంగా మారడంతో రాత్రి సమయంలో వాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి

నూతనంగా ఏర్పాటు చేసి ప్రధాన రహదారి రెండు మీటర్లు ఎత్తు పెంచడంతో రోడ్డు సైడు ఉన్న దుకాణాలు చాలా వరకు మునిగిపోయాయి. దీంతో వర్ష కాలంలో వరద నీరు దుకాణాల్లోకి వేళ్లే ప్రమాదం ఉంది. దుకాణల్లో ఉన్న లక్షలు విలువ చేసే సామగ్రి వరద నీటికి తడిస్తే ఆర్థికంగా నష్ట పోయే పరిస్థితి ఉందని దుకాణ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి రెండు వైపులు మురికి కాలువ నిర్మాణం చేపడితే వరద నీరు దుకాణం లోపలికి వెళ్లకుండా ఉంటుందని దుకాణదారులు కోరుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రోడ్డు వెంట సమస్యలు



- పడాల గణేష్, రుద్రంగి.

రుద్రంగిలో వేసిన రోడ్డు వెంట అనేక సమస్యలు ఉన్నాయి. రోడ్డు ఎత్తు పెంచడంతో షాపులు మునిగిపోయాయి. వర్షాకాలంలో వరద వచ్చే ప్రమాదం ఉంది. రోడ్డుకు రెండు వైపులా డ్రెయినేజీలు నిర్మించాలి. ప్రమాదకరంగా ఉన్న అప్రోచ్ రోడ్లపై సీసీ రోడ్లు వేయాలి.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతు చేయాలి



- ఉప్పులుటి గణేష్, గ్రామస్తుడు, రుద్రంగి.

రాత్రి సమయంలో సెంట్రల్ లైట్లు వెలగక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. చీకట్లో డివైడర్‌కు వాహనాలు తాకడంతో చాలా మంది ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించాలి. సెంట్రల్ లైట్లు వెలిగేలా పూర్తి స్థాయిలో మరమ్మతు చేయాలి.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



- సతీశ్, ఏఈ, ఆర్అండ్‌బీ

త్వరలోనే రోడ్డుకు ఇరువైపుల మురికి కాలువల నిర్మాణ పనులను చేపడతాం. పూర్తయిన వెంటనే అప్రోచ్ రోడ్లను సమాంతరంగా వేసి సీసీ రోడ్డు ఏర్పాటు నిర్మానం చేపడతాం. సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతు చేయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

సాగునీటి తరలింపునకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు


ఇరుగ్రామాల రైతుల మధ్య వాగ్వాదం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11: ఎండిపోతున్న పంటలకు సాగునీటిని తరలించేందుకు రైతులు ఆదివారం ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా రంగనాయకసాగర్ నుంచి సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం విఠలాపూర్ వరకు కెనాల్ నిర్మాణం చేపట్టింది. ఈ కెనాల్ ద్వారా దాచారం గ్రామంలోని ఆముదాలకుంటకు సాగునీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రైతుల డిమాండ్ మేరకు అధికారులు కెనాల్‌కు చిన్నగా గండికొట్టి సాగునీటిని విడుదల చేశారు. భూగర్భ జలాలు తగ్గినందున మరోసారి నీటిని విడుదల చేయాలని అధికారులను కోరగా వారు అంగీకరించారు. నీటిని విడుదల చేస్తే దిగువన ఉన్న విఠలాపూర్ రైతుల భూములకు నష్టం జరుగుతుందని ఆప్రాంత రైతులు నీటి విడుదలను అడ్డుకుంటున్నారు. దీనిపై వారం రోజుల క్రితం రైతులతో కలిసి యువజన సంఘాల నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు చెప్పిన గడువు ముగియడంతో రైతులు కెనాల్ వద్దకు వెళ్లి నీటిని తరలించడానికి యత్నించారు. విఠలాపూర్ గ్రామరైతులు కూడా చేరుకోగా ఇరు గ్రామాల రైతుల మధ్య వాదోపవాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, రెండు రోజుల సమయం ఇవ్వాలని కోరారు. దీనిపై ప్యాకేజీ 11 డీఈ సీతరామరాజును వివరణ కోరగా దాచారం గ్రామానికి నీటిని విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతుల భూమికి కొంతనష్టం జరుగుతుందని, వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి, నాయకులు మామిడి హరీష్, గజ్జల శ్రీనివాస్, దండవేణి రజనీకాంత్, డాన్ శ్రీను, కోమటిరెడ్డి అఖిల్, పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 11: సిరిసిల్ల పట్టణంలో చోరీకి యత్నిస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి పట్టణంలోని శాంతినగర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీకి యత్నిస్తున్న ఇద్దరు దొంగలను స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా దొంగతనాలు పెరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. ఇదే సమయంలో ఇద్దరు దొంగలు సిరిసిల్ల పోలీసులకు చిక్కారు.

ఆటో ఢీకొని విద్యార్థినికి గాయాలు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 11: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గురుకుల విద్యాలయం సమీపంలో ఆటో ఢీకొనడంతో మానస(10) అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన దుర్గయ్య కూతురు మానస గురుకుల ప్రవేశ పరీక్ష రాసి వస్తోంది. అదే సమయంలో సిద్దిపేట వైపు నుంచి వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ప్రమాదంలో మానసకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ విద్యార్థినిని 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

చందుర్తి, ఫిబ్రవరి 11 : చందుర్తి మండలం బండపల్లిలో బీహార్‌కు చెందిన మహిళ 108 అంబులెన్స్‌లో బిడ్డకు జన్మనిచ్చింది. జీవనోపాధి కోసం చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని ఇటుక బట్టీల్లో పనిచేయడానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చింది. ఆదివారం ఉదయం పురిటినొప్పులు రావడంతో 108లో చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ జీ.విక్రమ్, పైలట్ ఆర్. బాబు, ఆశా కార్యకర్త రమణ తెలిపారు. అనంతరం చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించామని పేర్కొన్నారు.

పాలకులు మారుతున్నా వడ్డెరుల బతుకులు మారడం లేదు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11 : పాలకులు మారుతున్నా వడ్డెరుల బతుకులు మారడం లేదని తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపు లక్ష్మణ్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వడ్డెరుల బతుకులు మారాలంటే ముందుగా ప్రభుత్వం వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వడ్డెర విద్యార్థులకు గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. వడ్డెర కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటుకు రూ.1000 కోట్లు నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. వడ్డెర కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పనులలో 20 శాతం ఈఎండీ లేకుండా పనులు కేటాయించాలని, బండ క్వారీలపై వడ్డెర్లకు పూర్తి హక్కులను కల్పించాలని అన్నారు. వడ్డెర జనాభా ప్రాతిపాదకన రాజకీయాలలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాపకాయల సంతోష్, జిల్లా కార్యదర్శి శివరాత్రి ఆయిలయ్య, జిల్లా కోశాధికారి సూర్య ప్రశాంత్, వేములవాడ నియోజకవర్గం అధ్యక్షుడు పల్లపిశాక్, మండల అధ్యక్షుడు కొడదల కొమురయ్య, లీగల్ అడ్వైజర్ బోధస్ రమేష్, నాయకులు సూర రాము, ధన్ల అంజి, బత్తుల లక్ష్మణ్, ఆలకుంట దుర్గయ్య, శివరాత్రి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11: ఉపాధి హామీ పథకంలో 2006 నుంచి పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని కార్మిక భవనంలో మాట్లాడారు. 2006 నుంచి ఇప్పటి వరకు ఉపాధిహామీ పథకంలో దాదాపు 7665 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించడం మూలంగా రెండు సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నారన్నారు. ఉపాధి లేక ఆకలితో అలమటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 90 మంది ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మొట్టికాచలు వేయడంతో మళ్లీ ఉద్యోగాల్లోకి తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం నెలకు రూ. 26వేల కనీస వేతనం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లను ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, సర్క్యులర్ 4779ని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఎఫ్‌టీలుగా గుర్తించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లలో హెచ్చుతగ్గులు లేకుండా అందరికీ ఒకే జీతం ఇవ్వాలని, కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్ల నియమకాలను చేపట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగాలు పోయి వివిధ కారణాలతో మరణించిన 90 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌ల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 18న సిరిసిల్ల పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ల జిల్లా స్థాయి సదస్సును ఉంటుందని, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి సదస్సులో ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, సీపీఐ నాయకులు నల్ల చంద్రమౌళి, సోమ నాగరాజు పాల్గొన్నారు.

కన్న కొడుకే కాలయముడు

- బాబాయ్‌తో కలిసి తండ్రిని హత్య చేసిన వైనం
- మంత్రాల నెపమే హత్యకు కారణం - 48 గంటల్లో ఛేదించిన పోలీసులు

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11: మంత్రాల నెపంతో బాబాయ్‌తో కలిసి కన్న తండ్రిని కొడుకు హత్యచేశాడు. ఈ కేసును సిద్దిపేట రూరల్ పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం కార్యాలయంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను వివరాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ భూమయ్య తన కుటుంబసభ్యులతో కలిసి సిద్దిపేట జిల్లా కేంద్రంలో నివాసముంటున్నాడు. భూమయ్య సొంత తమ్ముడు నిమ్మ కనకయ్య కుటుంబసభ్యులు సొంత గ్రామంలోనే నివాసముంటున్నారు. వారు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. అందుకు భూమయ్య మంత్రాలు చేయడమే కారణమని ఇరువురి కుటుంబసభ్యులు గొడవపడేవారు. ఈ క్రమంలో భూమయ్య కుమారుడు నిమ్మ ప్రవీణ్‌తో కలిసి భూమయ్యను హత్య చేసేందుకు కనకయ్య పన్నాగం పన్నాడు. ఈ నెల 10న నామాపూర్‌కు భూమయ్యను పిలిపించారు.భూమయ్యతో కలిసి కనకయ్య ప్రవీణ్ మద్యం తాగారు. రాత్రి కావడంతో భూమయ్యను సిద్దిపేటలో దింపేందుకు బైక్‌పై ముగ్గురు కలిసి బయలుదేరారు. సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్ గ్రామ శివారులో పిట్టలవాడ సమీపంలో మళ్లీ మద్యం తాగారు. నిందితులు అనుకున్నట్టుగా మద్యంలో పురుగుల మందు కలిపి మృతుడు భూమయ్యకు తాగించారు. దీంతో భూమయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం మృతదేహంపై గడ్డివేసి తగులబెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా ఈ ఘటనపై రాఘవాపూర్ గ్రామ కార్యదర్శి యాదగిరి సిద్దిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ కిరణ్‌రెడ్డి విచారణ చేపట్టి 48 గంటల్లో నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు.

చలో నల్గొండను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 11: కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో నిర్వహిస్తున్న చలో నల్గొండ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న పిలుపునిచ్చారు. ఆదివారం తంగళ్లపలి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాటాడారు. కృష్ణానది జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 13న చలో నల్గొండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా బేసిన్‌ప్రాజెక్టులను అవగాహన రాహిత్యంతో కేంద్ర ప్రభుత్వ కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డుకు అప్పగించిందని విమర్శించారు. ప్యాక్స్ చైర్మన్‌లు బండి దేవదాసు, కోడూరు బాస్కర్, సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, మాట్ల మధు, వలకొండ వేణుగోపాలరావు, ఈసరి ఉమారాజు, మిరాల బాస్కర్, ఏసిరెడ్డి రాంరెడ్డి, సిలివేరి నర్సయ్య, కోడి అంతయ్య, పడిగెల రాజు, ములిగె దుర్గాప్రసాద్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: నల్గొండలో బీఆర్ఎస్ రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తెర్లమద్ది, బందనకల్, మొర్రాపూర్, వెంకట్రావుపల్లె, గూడెం అవునూర్‌లో సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


పార్టీలో చేరిన నాయకులతో కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్/ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి పక్షంలో ఉండడంతో బీఆర్ఎస్ దిక్కు తోచని స్థితిలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే వారికి ఒక్క పార్లమెంటు స్థానం కూడా దక్కదని బీఆర్ఎస్ ఆలోచనలో పడిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో అన్ని స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుండడంతో ప్రజలు పార్టీని ఆదరిస్తున్నారన్నారు. అనంతరం గొల్లపల్లి, పదిర తదితర గ్రామాలకు చెందిన సుమారు 300 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, తిరుపతి, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణమూర్తి, బాబు, బుచ్చాగౌడ్, లాల, మహేందర్, రాజేందర్, బాలకిషన్, రాజునాయక్, పద్మ పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పలువురు ఆదివారం ఆ పార్టీలో చేరారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు 17వ వార్డు నుంచి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోడం సత్యనారాయణ కుమారుడైన కోడం అమర్ చేనేత వ్యాపార సంగం డైరెక్టర్ దూడం శ్రీను, రహీమ్, గుజ్జె నవీన్, రమేష్, ప్రవీణ్, మరో 30 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాగుల సత్యనారాయణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత నలినీకాంత్ టౌన్ అధ్యక్షురాలు వెలుముల స్వరూపతిరుపతి రెడ్డి, వైద్య శివప్రసాద్ పాల్గొన్నారు.